నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 21 మే 2024 | YADADRI BHUVANAGIRI



నకిరేకల్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్

# కాంగ్రెస్, బీజేపీని పట్టభద్రులు నమ్మరు

- ప్రధాని మోదీ కొత్త నాటకం మొదలు పెట్టిండు
- 40 కోట్ల మందికి అన్నం లేకుండా చేసిండు
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి బాగోతం బట్టబయలైంది
- ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నకిరేకల్/ హాలియా, మే 20 : కాంగ్రెస్, బీజేపీలను పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నకిరేకల్, హాలియాలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మొన్నటి దాకా గుడి పేరు చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఇప్పుడు పొరుగు దేశం అడుక్కునేటట్లు చేసినమని చెప్పుకొంటున్నాడని, ఆ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీయడం సరికాదని అన్నారు. ఏ దేశ ప్రజలైనా బాగుండాలని కోరుకోవాలే తప్ప.. వాళ్ల గురించి తప్పుడు మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు. మోదీ పదేండ్ల పాలనలో సంవత్సరానికి రెండు కోట్ల చొప్పున దేశానికి 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అవి ఇవ్వకపోగా.. 40 కోట్ల మంది భారతీయులకు అన్నం లేకుండా చేశాడని విమర్శించారు. దేశంలో ఇవాళ 40 కోట్ల మంది ప్రజలు ఒక్క పూట తిని బతుకుతున్నారని, రెండు పూటలా అన్నం తింటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. మోదీ 25 ఏండ్ల పాలనలో గుజరాత్‌లో కూడా ఇవాళ ఒక్క పూట మాత్రమే తిని కడుపు మాడ్చుకుంటున్న ప్రజలు చాలా మంది ఉన్నారన్నారు. శాసనసభ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపిస్తే ప్రభుత్వ మెడలు వంచి హామీలను అమలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన గోబెల్స్ వారసులకు, నాయకులకు పట్టభద్రులు కర్రు కాల్చి వాత పెట్టాలని సూచించారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదన్నారు. దందాలు చేసి కోట్ల రూపాయలు వెనుకేసుకున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బాగోతం బట్టబయలైందని, ఆయనతో పనిచేసిన వాళ్లే ఈ విషయం బయటకు చెప్తున్నారని చెప్పారు. బీజేపీ అభ్యర్థికి మాటలు వస్తయా.. రావా?, ఆయన గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విద్యావంతుడని, సొంతంగా ఎదిగి ప్రజా సేవ చేద్దామని రాజకీయాల్లోకి వచ్చాడని తెలిపారు. కేసీఆర్ ఎక్కడ అని ప్రజలు వెతుక్కుంటున్నారని, మళ్లీ కేసీఆర్ రాజ్యమే వస్తుందని, బీఆర్ఎస్ శ్రేణులు నిరుత్సాహపడొద్దని భరోసా కల్పించారు. బూత్ ఇన్‌చార్జిలు పూర్తి బాధ్యతగా ఉండాలని, ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. హాలియాలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని పార్టీలకతీతంగా ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రాడ్యుయేట్ వద్దకు వెళ్లి రాకేశ్‌రెడ్డికి ఓటు వేసేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశాల్లో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రాంచందర్‌నాయక్, మేడే రాజీవ్‌సాగర్, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు రాంబాబు యాదవ్, పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కడారి అంజయ్య యాదవ్, అనుముల ఎంపీపీ సుమతీపురుషోత్తం, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, జడ్పీటీసీలు మాధ ధనలక్ష్మీనగేశ్, తరాల బలరాం, నాయకులు పాల్గొన్నారు.

## నేడు నల్లగొండకు మాజీ మంత్రి కేటీఆర్



నల్లగొండ ప్రతినిధి, మే 20 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం నల్లగొండకు రానున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో జరుగనున్న పార్టీ శ్రేణులు, పట్టభద్రుల సమావేశాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నేరుగా కేటీఆర్ నల్లగొండకు చేరుకుంటారు. నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగే మీటింగ్‌లో పాల్గొంటారు. అనంతరం దేవరకొండకు బయల్దేరి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఇంటికి మధ్యాహ్నం 1:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ రవీంద్ర కుమార్ తండ్రి కనీలాల్‌నాయక్ దశదిన కర్మకు హాజరవుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3గంటలకు హాలియాకు చేరుకుని నాగార్జునసాగర్ నియోజకవర్గ సమావేశంలో ప్రసంగిస్తారు. సాయంత్రం 4:30 గంటలకు మిర్యాలగూడకు చేరుకుని అక్కడ సమావేశంలో పాల్గొంటారు. సాయం త్రం 6గంటలకు హుజూర్‌నగర్ చేరుకుని అక్కడ పట్టభద్రులు, పార్టీ నేతలు, శ్రేణులతో జరిగే మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొననున్నారు.

### బీఆర్ఎస్ ఇన్‌చార్జిలు వీరే..

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు స్థానికంగా ఉన్న మాజీ ఎమ్మెల్యేలకు తోడుగా మరొకరిని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా ఎన్నికల ఇన్‌చార్జిలపై తాజాగా ప్రకటన చేశారు. తాజా లిస్ట్ ప్రకారం దేవరకొండకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బలరాజు, మిర్యాలగూడకు కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, మునుగోడుకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాగార్జునసాగర్‌కు కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్, నకిరేకల్‌కు కార్మిక విభాగం నేత రాంబాబుయాదవ్, నల్లగొండకు మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే విజయుడు, కోదాడకు కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీహెచ్ రాకేశ్‌కుమార్, సూర్యాపేటకు సీనియర్ నేత నవీన్‌కుమార్, తుంగతుర్తికి సీనియర్ నేత గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఆలేరుకు కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, భువనగిరికి సీనియర్ నేత ఇబ్రహీం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారు. వీరంతా ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్థానిక తాజా, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ ముందుకు నడిపించనున్నారు.



కనీలాల్‌నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, జడ్పీచైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భగత్, రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నేత కంచర్ల కృష్ణారెడ్డి

## రవీంద్రకుమార్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శ

చందంపేట (దేవరకొండ), మే 20 : దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి, మాజీ సర్పంచ్ కనీలాల్‌నాయక్ మృతి బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కనీలాల్‌నాయక్ ఇటీవల మృతిచెందగా.. సోమవారం దేవరకొండలోని ఆయన నివాసంలో రవీంద్రకుమార్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కనీలాల్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి రిటైర్డ్ అయిన తర్వాత సర్పంచ్‌గా ఎన్నికై ప్రజా సేవ చేసిన కనీలాల్‌నాయక్ మృతి బాధాకరమన్నారు. నివాళులు అర్పించిన వారిలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, టీవీఎన్ రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, గాజుల ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, సత్యనారాయణ, దస్రూనాయక్, వెంకటయ్య, రాజు, కృష్ణ, తులసీరాం, ఇలియాస్, పటేల్, బాబా ఉన్నారు.



నల్లగొండలో టెట్ అభ్యర్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య, డీఈఓ భిక్షపతి

## సజావుగా టెట్

- తొలిరోజు నల్లగొండలో 48 మంది అభ్యర్థులు గైర్హాజరు
- తనిఖీ చేసిన డీఈఓ భిక్షపతి

రామగిరి, మే 20 : తెలంగాణ టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) ఆన్‌లైన్ పరీక్ష నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం సజావుగా సాగింది. టెట్ పరీక్షను గతంలో మాదిరిగా ఓఎంఆర్ విధానంలో కాకుండా తొలిసారిగా సీబీటీ (కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) పద్ధతిలో నిర్వహించారు. టెట్ పరీక్షలు జూన్ 2వరకు కొనసాగనుండగా.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశాల ఆవరణలో డీపీఎంఎస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో తొలి రోజు గణితం, సైన్స్ విభాగంలో జరిగిన పరీక్షకు ఉదయం 185 మందికి 158మంది అభ్యర్థులు హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 185 మందికిగాను 164 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు నీలంరెడ్డి తెలిపారు.

పరీక్షలను జిల్లా విద్యాశాఖ కార్యాలయం సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి ఆర్.రామచంద్రయ్య పరిశీలించారు. పరీక్ష కేంద్రాన్ని డీఈఓ బి.భిక్షపతి ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు.



తిరువేంకటపతిగా మాఢవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

## నృసింహుడి జయంత్యుత్సవాలు

- ఉదయం తిరు వేంకటపతి అలంకార సేవ.. సాయంత్రం గరుడ వాహనంపై వాసుదేవుడిగా తిరువీధి సేవ

యాదగిరిగుట్ట, మే 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి స్వయంభూ ప్రధానాలయం, అనుబంధ పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలను అర్చకులు అత్యంత వైభవంగా ప్రారంభించారు. గర్భాలయ ముఖ మండపంలో మంత్ర, వేద సౌష్టవంగా, కళాత్మకంగా మహావైభోపేతంగా ఉత్సవాలు జరిగాయి. ఉదయం ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. 8:30 గంటలకు ఆలయ ముఖ మండపంలో స్వస్తీవాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణం, కుంకుమార్చన, రక్షాబంధనం వంటి కైంకర్యాలను చేపట్టారు. అనంతరం స్వామివారికి లక్ష కుంకుమార్చన గావించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరువేంకటపతి అలంకార సేవలో భక్తకోటిని భగవానుడు అనుగ్రహించారు. మధ్యాహ్నం 12గంటలకు స్వామివారిని స్వయంభూ ప్రధానాలయ మాఢ వీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగించారు. సాయంత్రం 6 గంటలకు నిత్య సామూహిక పారాయణం అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ అంకురారోపణం, హవనం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పరమవాసుదేవుడిగా అలంకరించి గరుడ వాహనంపై తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. స్వయంభూ పంచనారసింహుడి క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను పరవాసుదేవ తత్త్వాలుగా అలంకరించారు. ప్రధానాలయ మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జయంత్యుత్సవాల సందర్భంగా ప్రధానాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన లంగ్ కేర్ సెంటర్, స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పూజా కైంకర్యాలలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఏఈఓలు జూశెట్టి కృష్ణ, గజవెల్లి రమేశ్‌బాబు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

### ఆలయంలో నేడు..

స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9:30 గంటలకు నిత్యమూల మంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన, కాళీయమర్దన అలంకార సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు నృసింహ మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి చేపట్టి హనుమంత వాహనంపై రామావతారం అలంకార సేవ చేపట్టనున్నారు.

# వడ్లు మొలకెత్తుతున్నయ్..



### సర్కారు నిర్లక్ష్యంతో రైతన్న ఆగమాగం

- వరుస వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- పేరుకే కొనుగోలు కేంద్రాలు.. కొనుడు అంతంతే..
- ఇప్పటి వరకు కొన్నది 2.64లక్షల మెట్రిక్ టన్నులే..
- వడ్లు కాంటా వేసినా తరలింపులో జాప్యం
- ఇంకా తీరని లారీల సమస్య, హమాలీల కొరత
- వరుణుడి ప్రతాపంతో ఆందోళనలో అన్నదాత

ఈ ఫొటో తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి కొనుగోలు కేంద్రంలోనిది. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయింది. కేంద్రం వద్ద ధాన్యం ఇలా తడిసి మొలకెత్తింది. తుర్కపల్లి మండలంలోని మెజార్టీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగడంలేదు. వాసాలమర్రిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదు లారీల ధాన్యం మాత్రమే ఎగుమతి చేశారు. దీంతో వర్షాలతో ధాన్యం తడిసి, మొలకలు వచ్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – యాదాద్రి భువనగిరి, మే 20 (నమస్తే తెలంగాణ)

**సర్కారు నిర్లక్ష్యంతో రైతులు ఆగమైతున్నరు. జిల్లాలో వరుస వర్షాలతో వడ్లన్నీ తడిసి ముద్దవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు మొలకెత్తుతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెబుతున్నా అంతంత మాత్రంగానే కొనుగోళ్లు చేపడుతున్నది. కేంద్రాల్లో కొన్న ధాన్యం తరలింపులో జాప్యం చేస్తున్నది. మొదటి నుంచీ ఉన్న లారీల సమస్య ఇంకా తీరలేదు. అంతిమంగా అన్నదాత అష్టకష్టాలు పడుతున్నారు.**



భువనగిరిలో మండలం పెంచికల్ పహాడ్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

జిల్లాలో యాసంగిలో 2.93లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. సుమారుగా 5.25లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. సివిల్ సప్లయ్ అధికారులు నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ధాన్యం కొనుగోళ్లు మాత్రం సరిగా జరుగడంలేదు. ఎక్కడ పోసిన ధాన్యం కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు.

### అకాల వర్షాలకు ఆగమాగం..

అకాల వర్షాలు రైతులను ఇబ్బదులు పెడుతున్నాయి. జిల్లాలో ఇటీవలి కాలంలో నిత్యం అనేక చోట్ల వానలు దంచికొడుతున్నాయి. అయితే కేంద్రాల్లో వర్షం నుంచి రక్షించుకునేందుకు సరిపడా టార్పాలిన్లు, షెడ్లు లేకపోవడంతో ధాన్యం తడిసి మొలకెత్తుతున్నది. ఈ క్రమంలో వడ్లను కాపాడుకునేందుకు కర్షకులు అష్టకష్టాలు పడుతున్నారు. వడ్లను కనీసం ఆరబెట్టుకునే పరిస్థితి కూడా లేదు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధాన్యం తడిసిందంటూ రైతులు ఆవేదన చెందుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. చేతికొచ్చిన పంట ఆగం అవుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

### కొన్నది 2.64 లక్షల మెట్రిక్ టన్నులే..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయి. రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా.. ప్రతిపక్షాలు మండిపడుతున్నా కొనుగోళ్లలో మాత్రం స్పీడ్ పెరుగడం లేదు. జిల్లాలో కేంద్రాలు ప్రారంభించి నెలన్నర దాటిపోయినా ఇప్పటి వరకు 2,64,093 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొన్నారు. ఇంకా సుమారు లక్షన్నర టన్నుల వరకు ధాన్యం ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావాలి. కానీ.. ఈ సారి మాత్రం ఆ పరిస్థితులు కనిపించడంలేదు.

### ఇంకా తీరని లారీల సమస్య

ప్రభుత్వం ధాన్యం కాంటా వేసినా తరలింపులో మాత్రం జాప్యం చేస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే దర్శనమిస్తున్నది. కేంద్రాల వద్ద కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణంగా లారీ కొరత. లారీల కోసం రైతులు దీనంగా ఎదురు చూస్తున్నారు. మొదటి నుంచీ లారీల కొరత ఉంది. సమస్య ఉన్నదని తెలిసినా పరిష్కారం కావడం లేదు. మరోవైపు హమాలీల సమస్య కూడా వేధిస్తున్నది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలిచిపోతుండటంతో వర్షం వస్తే తడిసి ముద్దవుతున్నది.

### నెల రోజులుగా ధాన్యం కొంటలేరు



ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనడం లేదు. ధాన్యం తెచ్చినప్పటి నుంచి మూడు నుంచి నాలుగు సార్లు వర్షం పడింది. తడిసిన ధాన్యం ఎండబెట్టడం మళ్లీ కుప్ప నూర్చడానికే సరిపోతుంది. వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలా జరుగలేదు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి.

– గణేశ్, రైతు, కొండాపురం, తుర్కపల్లి మండలం

### వర్షానికి ధాన్యం తడిసింది



పెంచికల్‌పహాడ్ ఐకేపీ సెంటర్‌లో నెల రోజుల నుంచి వడ్లు కాంటా పెట్టడంలేదు. కాంటా పెట్టినా ధాన్యం ట్రాన్స్‌పోర్టు చేయడంలేదు. ఇటీవల కురిసిన వర్షానికి వడ్లు తడిసి మొలకెత్తాయి. ధాన్యాన్ని కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నాం. ప్రభుత్వం, అధికారులది హడావుడే తప్ప ఆచరణలో కనిపించంలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– సుబ్బురు పర్వతాలు, రైతు, పెంచికల్ పహాడ్, భువనగిరి మండలం

### వడ్లు భూదేవి పాలవుతాయని గుబులేస్తుంది..



కాయకష్టం చేసి పండించిన వడ్లు సర్కారు ధరకు అమ్మేందుకు నాలుగు వారాల కిందట తీసుకుపోయి కొనుగోలు సెంటర్‌లో కుప్ప పోసిన. ఇంటిల్లిపాది దినాం ఇరాం లేకుండా గలగల ఎండేవరకు మండుటెండల ఎండబోసినం. ఒక్క సారు కూడా వడ్ల కాడికి వచ్చి గిప్పుడో అప్పుడో కొంటామని చెప్పినోళ్లు లేరు. గిప్పుడేమే కాలంగాని కాలంలో వానలు పడవట్టె. కుప్ప పోసిన వడ్లు వానకు తడిసిపోయి మొలకలు రాబట్టె. వడ్లు కొనండి సారు అని కాళ్లవేల్లాబడి మొక్కినా కనికరిస్తలేరు. వానకు తడిసిన వడ్లను మల్ల ఆరబోసినాక చూస్తాంలే అని బుకాయిస్తున్నారు. ఆ సార్ల మాటలు వింటుంటే కష్టమంతా భూదేవి పాలవుతుందని గుబులేస్తుంది.

– గొడుగు మల్లయ్య రైతు పాముకుంట, రాజాపేట మండలం

## ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, మే 20 : ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సెక్టార్ ఆఫీసర్లకు, టీములకు సూచించారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా సెక్టార్ ఆఫీసర్లకు, ఎఫ్ఎస్‌టీ, స్పెషల్ వీడియో టీమ్స్, ఎంసీసీ టీములకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం మీటింగ్ హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. భువనగిరి డివిజన్‌లో 22, చౌటుప్పల్ డివిజన్‌లో 15 కలిపి.. మొత్తం 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. భువనగిరి డివిజన్‌లో 7,784 మంది మహిళలు, 12,421 మంది పురుషులు, చౌటుప్పల్ డివిజన్‌లో 5,458 మంది మహిళలు, 8,417 మంది పురుషులు కలిపి మొత్తం 34,080 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో 12మంది సెక్టార్ ఆఫీసర్లు, 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు, 17 స్పెషల్ వీడియో టీములు, 17 ఎంసీసీ టీములు పర్యవేక్షిస్తాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా సెక్టార్ ఆఫీసర్లు చూడాలని, బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా ఓటర్లకు పోల్ స్లిప్స్ పంపిణీ పూర్తయ్యేలా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితోపాటు పోలింగ్ మెటీరియల్ సకాలంలో వెళ్లేలా, తిరిగి పోలింగ్ కేంద్రాల నుంచి పోల్ అయిన మెటీరియల్ రిసెప్షన్ సెంటర్‌కు చేరుకునేలా పర్యవేక్షించాలని సూచించారు. ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ విధులు నిర్వహిస్తారని, పోలింగ్ రోజున పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించకుండా, ఉల్లంఘనలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వివరాలు తెలుపాలని, పోలింగ్ సమయం ముగిసే (సాయంత్రం 4గంటల) వరకు పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన వారందరూ ఓటు వినియోగించుకునేలా చూడాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలపై, బహుమతులు, కానుకలు, నగదు, మద్యం పంపిణీపై నిఘా టీమ్‌లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని అన్ని నిబంధనలను పాటించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 52మంది పోటీ చేస్తున్న ఈ ఎన్నికల్లో జంబో బ్యాలెట్ బాక్స్ వినియోగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్ పాల్గొన్నారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించారు.